RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 241 | ఆగస్టు 23, 2025 | వెల : రూ.3-00



గణేష్ మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి

2లో..

- అది పెన్షన్ కాదు
- ఎన్నికల హామీని రాష్ట్ర సర్కారు నిలబెట్టుకోవాలి
- ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలి
- పీఆర్ టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రయ్య పటేల్




# సీపీఎస్.. కాలనాగు..!

**వేద న్యూస్, డెస్క్ :**

కాంట్రిబ్యూటరీ పెన్షన్ కాదు అదొక కాలనాగు పెన్షన్. దశాబ్దాల పోరాటం ఫలితంగా ఏర్పడ్డ పూర్తి పెన్షన్ విధానాన్ని మట్టిలో కలిపేసిన రోజు 1సెప్టెంబర్ 2004. దానికి కొనసాగింపుగా కొత్త రాష్ట్రంలో 2014 ఆగస్టు 23న తెలంగాణ ఉద్యోగులను పూర్తిగా సిపిఎస్ లోకి నెట్టేయబడిన రోజు ఆగస్టు 23. ఆనాటి కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి కాంట్రిబ్యూటర్ పెన్షన్ విధానాన్ని అమలు చేస్తూ ఉద్యోగి కొంత, ప్రభుత్వం కొంత మొత్తాన్ని స్టాక్ మార్కెట్లో పెట్టుబడిగా పెడితే రిటైర్మెంట్ నాటికి మార్కెట్ ఒడిదలుకులు దాటుకుంటూ కొంత మొత్తంగా ఉద్యోగి జేబులోకి చేరుతుందని దానితో శేష జీవితాన్ని వెళ్ళదీయాలని, ఉద్యోగులకు పూర్తి పెన్షన్ అవసరం లేదన్నట్టు ఆనాటి కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంది. ఉద్యోగి తన యవ్వనమంతా ఇటు ప్రభుత్వాలకు అటు ప్రజలకు దారబోసి సేవచేస్తే, అవసాన దశలో సర్వావయవాలు, బొక్కలన్నీ శిథిలమై పూర్తిగా విశ్రాంతి తీసుకునే వయసులో పెన్షన్ అవసరం లేదని ప్రభుత్వాలు బాధ్యతల నుండి తప్పుకోవడం దురదృష్టకరం. అదే కేవలం ఐదు సంవత్సరాలు ఎమ్మెల్యేగానొ, ఎంపీగానో వెలగబెట్టిన రాజకీయ నాయకునికి మాత్రం చచ్చేంత వరకు రాజభోగాలతో కూడిన పెన్షన్ తో పాటు ఇతర వసతులు అలవెన్స్ లు కల్పించి నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్నట్టు ప్రవర్తిస్తున్నాయి ప్రభుత్వాలు. 1982లో డిఎస్ నకారా కేసులో ఆనాడు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ చారిత్రాత్మకమైన తీర్పు వెలువరిస్తూ పెన్షన్ అనేది ప్రభుత్వాలు దయాదాక్షిణ్యం మీద ఇచ్చే బిక్ష కాదని, ఉద్యోగి అవసాన దశలో శేష జీవితం గౌరవంగా గడపడానికి కల్పించే వసతి అని తీర్పు చెప్పారు. ఫలితంగా 1957 నుండి 1982 వరకు జరిగిన ఉద్యమాలలో ఆకలి ఆర్తనాధాలతో కడుపుమంటతో అనేక ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక వర్గపోరాటాలు, అర్థాల్లు, నిరసనలు, నిరాహార దీక్షలు, సమ్మెల ఫలితంగా జస్టిస్ చంద్రచూడ్ 1982లో వెలువరించిన చారిత్రాత్మక తీర్పుననుసరించి పూర్తి పెన్షన్ సాధించుకున్నాం. తీరా 20 సంవత్సరాల కాలం పాటు పూర్తి పెన్షన్ ఫలితాలు అనుభవించామో లేదో 2004లో ఎవ్వారమంతా మళ్లీ మొదటికొచ్చింది. ఆరోజునుండి మళ్లీ దేశవ్యాప్తంగా సిపిఎస్ వ్యతిరేక ఉద్యమాలు ఊపందుకున్నాయి. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల ఆశలు ఆకాంక్షలను అర్థం చేసుకొని పాత పెన్షన్ అమలు చేస్తున్నాయి. ఆంధ్ర, తెలంగాణ తెలుగు రాష్ట్రాలు డెత్ కం రిటైర్మెంట్ గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ ఇస్తామని కొంత ఉపశమనం కల్పించి ఒప్పుకున్నప్పటికీ అది పూర్తిస్థాయి పాత పెన్షన్ విధానం లోకి రాదని, ఉద్యోగి జీతం నుండి చెల్లింపులేనీ పాత పెన్షన్ విధానం అమలు చేస్తేనే బాగుంటుందని పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. 14 సంవత్సరాల పాటు సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు కొత్త రాష్ట్రంలో పాత పెన్షన్ అమలవుతుందన్న ఆశతో పిల్లా జెల్లా కుటుంబాలతో సహా మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. పాత పెన్షన్ కోసం కొండకు ఎదురు చూసినట్టు చూశారు. ఎన్నో అభ్యుదయ భావాలతో అన్యాయానికి, అణిచివేతకు, వివక్షలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆనాటి ఉద్యమ నాయకుడు కేసీఆర్ వెంట నడిచారు. తీరా కొత్త రాష్ట్రం సిద్ధించాక కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి సీపిఎస్ లో ఉంటారా లేదా ఓపిఎస్ అమలు చేస్తారా అని లేఖ రాస్తే 2014 ఆగస్టు 23 రోజున జీవో నెంబర్ 28 జారీ చేసి కేంద్ర ప్రభుత్వానికి బదులిస్తూ ఉద్యమ స్ఫూర్తికి వ్యతిరేకంగా మేము సీపిఎస్ లోనే ఉంటామని కొత్త తెలంగాణ ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగుల ఆశల మీద నీళ్లు చల్లిన రోజు ఆగస్టు 23.

తెలంగాణలో ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేస్తామని ఆనాటి ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చింది. కానీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా సిపిఎస్ ఉద్యోగులంతా ప్రజా ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు పీఆర్ టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రయ్య పటేల్ తెలిపారు.



చంద్రయ్య పటేల్

---

# పిత్తాశయం నుంచి 131రాళ్లు తొలగింపు

**- పార్థసారథి నర్సింగ్ హెూమ్ లో అరుదైన శస్త్రచికిత్స**

**వేద న్యూస్, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణానికి చెందిన ఓ మహిళ కడుపునొప్పితో ఇబ్బందులు ఎదుర్కొంటూ వైద్యులను ఆశ్రయించగా, ఆమె పిత్తాశయంలో రాళ్లు ఉన్నట్లు తేలింది. శుక్రవారం స్థానిక పార్థసారథి నర్సింగ్ హెూమ్‌లో లాపరోస్కోపి పద్ధతిలో ఆ మహిళకు శస్త్రచికిత్స నిర్వహించారు. ఇందులో గాల్ బ్లాడర్ తొలగించగా 131 రాళ్లు బయటపడ్డాయని గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మలత వెల్లడించారు.ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మలత మాట్లాడుతూ పిత్తాశయంలో రాళ్లు ఏర్పడటానికి ప్రధాన కారణాలు అధికబరువు, వ్యాయామం చేయకపోవడం, తగిన ఆహారపు అలవాట్లు లేకపోవడం. మొదట్లో కడుపు నొప్పి, వాంతులు, జీర్ణకోశ సమస్యలతో ప్రారంభమై మెల్లగా తీవ్రరూపం దాల్చుతుందని సమయానికి గుర్తించకపోతే ప్రమాదం పెరుగుతుందని అన్నారు. ఈ సమస్యలు రాకుండా ఉండాలంటే ..రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని ,అధిక బరువు పెరగకుండా జాగ్రత్తపడాలన్నారు. ఫ్యాట్ ఎక్కువగా ఉండే ఆహారాలు తగ్గించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని ,కడుపునొప్పి, జీర్ణకోశ సమస్యలు వస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు.



---

# కలుషిత నీరు తాగి విద్యార్థులకు విరోచనాలు..!

**- హాస్పటల్లో చికిత్స పొందుతున్న 11 మంది విద్యార్థులు**
**- విద్యార్థులను పరామర్శించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసఫ్**

**వేద న్యూస్, జయశంకర్ భూపాలపల్లి :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న యుఆర్ఎస్ అర్బన్ రెసిడెన్షియల్ హాస్టల్లో ఉదయం అల్పాహారం చేసే సమయంలో కలుషితమైన నీరు తాగి 11 మంది విద్యార్థులకు కడుపునొప్పి,వాంతులు కావడంతో విద్యార్థులను స్థానికంగా ఉన్న వంద పడకల హాస్పటల్లో చేర్పించి చికిత్స చేయిస్తున్నారని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసఫ్ తెలియజేశారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు హాస్టళ్లపై పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి ఘటనలు జిల్లాలో పునరావృతం అవుతున్నాయని యుఆర్ఎస్ హాస్టల్ కి ఇప్పటివరకు సొంత భవనం లేకపోవడం, అద్దె భవనాల్లో హాస్టల్లో కొనసాగుతుంది, స్థానిక కలెక్టర్ చొరవ తీసుకొని విద్యార్థులకు సొంత భవనం నిర్మించాలని యుఆర్ఎస్ వార్డెన్ సస్పెండ్ చేయాలని నేరెళ్ల జోసెఫ్ డిమాండ్ చేశారు. గతంలో ఎన్నోసార్లు అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో నాణ్యమైన ఆహారం అందించడం లేదని ఎప్పుడు చూసినా కూడా పరిశుభ్రత లేని వాతావరణంలో విద్యార్థులకు ఆహార సదుపాయం పెట్టడం మూలాన ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని అంతేకాకుండా విద్యార్థుల యొక్క పరిశుభ్రతపై స్కూలుకు సంబంధించిన ఉపాధ్యాయుల పర్యవేక్షణ లేని మూలాన, ఇటువంటి పరిస్థితి వచ్చిందని ఈ నెలలోనే మొగుళ్ళపల్లి మండలంలో ఘటన మరువక ముందే విద్యార్థులు ఇటువంటి పరిస్థితికి రావడం శోచనీయమన్నారు. అయినా కూడా ఇక్కడున్న జిల్లా యంత్రాంగం జాగ్రత్తలు తీసుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు.



---

## కార్యకర్తల సమావేశాన్ని

# విజయవంతం చేద్దాం

**వేద న్యూస్, శేరిలింగంపల్లి :**



శేరిలింగంపల్లి నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశంకు గులాబీ సైనికులు పెద్ద ఎత్తున తరలి రావాలని బీఆర్ఎస్ సీనియర్ లీడర్ రవీందర్ యాదవ్ కోరారు. ఆదివారం మియాపూర్ లోని నరేన్ గార్డెన్స్ లో పెద్ద ఎత్తున ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లుగా వెల్లడించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్నట్లు స్పష్టం చేశారు. శేరిలింగంపల్లిలోని ఉద్యమ కారులు, యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు, విద్యార్థి నేతలు, మహిళా సోదరీమణులు, గులాబీ సైనికులు భారీ సంఖ్యలో తరలి రావాలని రవీందర్ యాదవ్ కోరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని.. పార్టీ బలోపేతం గురించి చర్చిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు అంతా పాల్గొని సత్తా చాటాలని రవీందర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో మళ్ళీ బీఆర్ఎస్ అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. కెసిఆర్ నాయకత్వంలో కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ బలమైన పోరాటం చేస్తోంది అన్నారు. కొంతమంది పార్టీలు మారినంత మాత్రాన పార్టీకి వచ్చే నష్టం లేదు అన్నారు. శేరిలింగంపల్లిలో నిర్వహించ తలపెట్టిన సమావేశంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలి అని రవీందర్ యాదవ్ ప్రత్యేకంగా కోరారు. మియాపూర్, మాదాపూర్, చందానగర్, హాఫిజ్ పేట్, లింగంపల్లితో పాటు నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరు కదిలి రావాలి అని రవీందర్ యాదవ్ పిలుపునిచ్చారు.

---

# సహస్ర మర్డర్ మిస్టరీ వీడింది..

**వేద న్యూస్ డెస్క్ :**



హంతకుడెవరో తేలిపోయింది.. పదేళ్ల బాలికను చంపింది పదో క్లాస్ కుర్రాడు. కత్తితో కసితీరా పొడిచి పొడిచి చంపాడు 15 ఏళ్ల టీనేజర్. ఊపిరి ఆగిపోయిన తర్వాత కూడా కత్తిపోట్లతో విరుచుకు పడ్డాడు. మీసాలు కూడా మొలవని బాలుడిలో ఇంత క్రూరత్వం చూసి పోలీసులే నివ్వరపోయారు. పోస్టుమార్టం నివేదిక ప్రకారం ఈనెల 18న ఉదయం 9.30 - 10.30 గంటల మధ్య సహస్ర హత్య జరిగినట్టు

మిగతా 3వ పేజీలో..

వేద న్యూస్

శనివారం ఆగస్టు 23, 2025

అనారోగ్యంతో బాధపడుతూ

# మల్లేశం ఆత్మహత్య

**వేద న్యూస్, కోనరావుపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన బోయిని మల్లేశం అనే వ్యక్తి అనారోగ్య సమస్యలతో తీవ్రంగా కృంగిపోయి ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లేశం పలుమార్లు ఆసుపత్రులకు వెళ్లినా పెద్దగా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. చివరికి తన సమస్యలను తట్టుకోలేక సూసైడ్ నోట్ రాసి జీవితం ముగించుకోవాలని నిర్ణయించుకున్నారు. సూసైడ్ నోట్‌లో తన అనారోగ్య సమస్యలను ప్రస్తావిస్తూ, ఇక బ్రతకడం కష్టమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆ లేఖ చదివిన బంధువులు, గ్రామస్థులు కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇబ్రహీంపట్నం ఉపాధి హామీ పనుల జాతర



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**

గ్రామీణాభివృద్ధి, ఉపాధి, పల్లెల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనుల జాతర 2025 కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఇబ్రహీంపట్నం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ఈజీఎస్ నిధుల ద్వారా గొర్ల షెడ్డు మంజూరు కాగా లబ్ధిదారులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ పనుల జాతరలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఆధ్వర్యంలో పశువుల పాకలు, గొర్రెల షెడ్లు, చెక్‌డ్యాములు, ఊటకుంటలు, ప్లాస్టిక్ వెస్ట్ యూనిట్లు, గ్రామీణ రహదారులు, కమ్యూనిటీ టాయిలెట్లు, అంగన్వాడీ, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం పాఠశాలల్లో మరుగుదొడ్లు వంటి పనులను చేపడుతున్నారని, దీనిలో భాగంగానే ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన బోడ దివాకర్ కు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద మంజూరైన గొర్ల షెడ్డు కు భూమి పూజ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ తిమ్మని అంజయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేట దర్గాను సందర్శించిన సీపీ



**వేద న్యూస్, కాజీపేట :**

హనుమకొండ జిల్లా, కాజీపేట పట్టణంలోని గల హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియబాని దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ కాజీపేట దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఉత్సవాలలో ఏర్పాటుచేసిన పోలీస్ బందోబస్తును సీపీ పర్యవేక్షించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక పోలీస్ అధికారులకు సీపీ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట సీఐ సుధాకర్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ వెంకన్న, స్థానిక ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, మత పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో నూతన హాజరు విధానం

**వేద న్యూస్, వరంగల్ :**

ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ నెల 23 (నేడు)నుంచి ముఖ గుర్తింపు ( ఫేస్ రికగ్నేషన్ సిస్టం) హాజరు పద్ధతిని అమలు చేయనున్నట్లు డిఐఈఓ జి. శ్రీధర్ సుమన్ తెలిపారు. శుక్రవారం ఇంటర్ విద్య కార్యాలయంలో ప్రిన్సిపల్ లకు, సంబంధిత ఇంఛార్జ్ లకు, ఉపాధ్యాయులకు నూతన హాజరు విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గూగుల్ ప్లే స్టోర్ ల నుండి టిజిఐఈఎఫ్ అనే ఆప్ ని డౌన్లోడ్ చేసి, రిజిస్టర్ చేసుకోని,దాని ద్వారా హాజరు నమోదు చేయాలని వివరించారు.

# గణేష్ మండపానికి అనుమతి తప్పనిసరి

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**




ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. శుక్రవారం వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించగా మెట్‌పల్లి సిఐ అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిభావంతో జరపుకోవాలని సూచించారు. గణేష్ మండపాల కొరకు విద్యుత్ శాఖ వారి అనుమతితోనే కనెక్షన్లు తీసుకోవాలని, షార్ట్ సర్క్యూట్ జరగకుండా మంచి నాణ్యత గల వైరును ఉపయోగించాలన్నారు. వృద్దులు చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తక్కువ శబ్ద కాలుష్యం గల స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలని, మండపాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ డిజేలను ఏర్పాటు చేయరాదని అన్నారు. పోలీస్ వారి సూచనలకు అనుగుణంగా మండపాల నిర్వహణ చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు జరుగకుండా చూడాలని నిర్వాహకులకు తెలిపారు. వారి మండపాల కమిటీ వివరాలు మండపాలకు బాధ్యత వహించే వారి ఫోన్ నెంబర్లను ప్రతి మండపాంలో ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి మండపాంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి వదంతులను వ్యక్తి చేయకుండా పోలీస్ శాఖకు తెలియజేయాలని కోరారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఆలయ గుడి చెరువులో నిమజ్జనం భక్తి భావంతో బ్రహ్మాండంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ అనిల్ కుమార్, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపిడివో సలీం, మేడిపల్లి ఏఈ ప్రశాంత్, ఇబ్రహీంపట్నం ఏఈ సతీష్ కుమార్, పాల్గొన్నారు.

# గణేష్ మండలపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో సిరిసిల్ల రూరల్ సిఐ మొగిలి,ఎస్సై సిరిసిల్ల అశోక్ ఆధ్వర్యంలో గణేష్ మండలపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు విద్యుత్తు వైర్ల వల్ల విద్యుత్ఘాతం సంభవించే ప్రమాదం ఉందని వాటివల్ల ప్రాణనష్టం వాటిలుతుందని తెలిపారు.మండపాల వద్ద సిసి కెమెరా ఏర్పాటు చేసుకోవాలని,మండల నిర్వాహకుల కమిటీ పేర్లను నమోదు చేసుకోవాలి. నిమజ్జనం రోజున గణేష్ శోభాయాత్రను ఏలాంటి అవాంఛనీయ సంఘనలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.అప్పుడే ప్రశాంతత వాతావరణంలో జరుపుకోవాలి. చెరువుల దగ్గర చిన్న పిల్లలు రాకుండా పెద్దలు మాత్రమే జాగ్రత్తగా నిమజ్జనం చేయాలి. డీజె లకు ఎలాంటి పర్మిషన్ లేదు ఎవరైనా డిజే సౌండ్ బాక్సలు పెట్టినచో కేసులు నమోదు చేయబడుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సై సిరిసిల్ల అశోక్,పోలీసులు మరియు ఆయా గ్రామాల మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.




# పల్లెల సమగ్రాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి

## - పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**వేద న్యూస్,శాయంపేట:**

తెలంగాణ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో శుక్రవారం పనుల జాతర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది. అందులో భాగంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నియోజకవర్గంలోని శాయంపేట మండలంలో జరిగిన పనుల జాతరలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని యంజేపీ బాలుర పాఠశాలలో నరేగా నిధులు రూ. 20 లక్షలతో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. ఎమ్మెల్యేకు పత్తిపాక గ్రామానికి చెందిన యంజేపీ స్కూల్ విద్యార్థి జగన్ 8వ తరగతి తాను తయారుచేసిన హ్యాండ్ క్రాఫ్ట్ ను ఎమ్మెల్యే కు అందజేశాడు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో స్వచ్ఛ భారత్ మిషన్ నిధులు రూ. 3 లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెల సమగ్రాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గ్రామాలను నిర్వీర్యం చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపించడంతో చాలా గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, అధికారులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.



# వ్యాపారుల ఆందోళన

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట :**




## - తహసీల్దార్ కార్యాలయం ఎదుట

ఓయూ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు “మార్వాడి హటావో తెలంగాణ బచావ్” కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలు వ్యాపార సంస్థల వ్యాపారులు ఆందోళన చేపట్టారు. ముందుగా బంధుకు పిలుపు ఇచ్చిన వ్యాపారులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. వ్యాపారుల ర్యాలీకి పోలీసుల అనుమతి లభించక పోవడంతో ఎల్లారెడ్డిపేట మండల ఎమార్వో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఎమార్వో కార్యాలయం ఎదుట ఫ్లెక్సీలు చేతబూని ధర్నా చేశారు. తెలంగాణాలో వ్యాపారులను తమ ,తమ రాష్ట్రాలకు పంపించాలని,తమ తమ కులవృతులను,వ్యాపారాలను కాపాడాలని కోరుతూ పలువురు వ్యాపారులు ఎల్లారెడ్డిపేట ఎం అర్ ఓ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు మాట్లాడారు. తెలంగాణ లో మార్వాడీల మూలంగా తమ వ్యాపారాలు దెబ్బతిని నష్టాల పాలవుతున్నట్లు తెలిపారు. మార్వాడీలు పలు రకాల వ్యాపారాలు ప్రారంభించి ఇక్కడి ప్రజలకు నాసిరకం సరుకులు,వస్తులువు,తక్కువ ధరలలో అందిస్తూ మోసం చేస్తున్నారని,వెండి,బంగారం వ్యాపారాలతో ఎలక్ట్రికల్ ,హోమ్ నీడ్స్ లాంటి వ్యాపారాలను ప్రారంభిస్తూ తమ వ్యాపారాలను దెబ్బతిస్తున్నారని వ్యాపారులుఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మార్వాడీ వ్యాపారులపై దృష్టి సారించి వారి మోసాలను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని, తెలంగాణ రాష్ట్రానికి చెందిన స్థానిక వ్యాపారుల వ్యాపారాలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరారు. వ్యాపారులు నిర్వహించిన ఆందోళనలో గొల్లపల్లి,బొప్పాపూర్,ఎల్లారెడ్డి పేటలకు చెందిన పలువురు స్వర్ణకారులు,ఎలక్ట్రిక్,హార్డ్వేర్,తదితర వ్యాపార సంస్థలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వేద న్యూస్, ముస్తాబాద్ :**

పనుల జాతర 2025 కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పనుల జాతర 2025 లో భాగంగా ఆవునూరు గ్రామంలో (క్యాటల్ షెడ్) పశువుల పాక నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్, ఉపాధి హామీ పథకం , పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా చేపట్టబోయే కొత్త పనులను మన జిల్లాలో ప్రారంభించడానికి పనుల జాతర 2025 అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు.

జిల్లాలోని 12 మండలాల పరిధిలోని అన్ని 260 గ్రామాలలో నేడు "పనుల జాతర-2025" కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధి హామీ పథకం, ఆర్.డబ్ల్యూ.యస్, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, స్వచ్ఛభారత్ వంటి విభాగాలలో చేపట్టనున్న పనులకు ఈ సందర్భంగా భూమి పూజలు చేస్తున్నామని అన్నారు. నూతన గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్ వాడీ భవనాలు, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) ద్వారా చేపట్టిన సెగ్రిగేషన్ షెడ్, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, "ఇందిరా మహిళా శక్తి %-% ఉపాధి భరోసా" క్రింద వ్యక్తిగత ఆస్తుల కల్పన పనులు అనగా పశువుల కొట్టం, కోళ్ళ షెడ్, గొర్రెల షెడ్, పండ్ల తోటలు, వానపాముల ఎరువుల తయారీ, అజోలా పిట్ నిర్మాణం, "జలనిధి" క్రింద వాన నీటి సంరక్షణ-భూగర్భ జలాలు పెంచే ఫారమ్ పాండ్స్, ఊట కుంటలు వంటి పనులకు ఈ కార్యక్రమం కింద చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ శేషాద్రి, ఈ.ఈ పి.ఆర్. సుదర్శన్ రెడ్డి స్థానిక నాయకులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ ఇంకుడు
# గుంతలు ప్రారంభం



**వేద న్యూస్, నల్లబెల్లి :**

ఉపాధి హామీలో మంజూరైన ఇంకుడు గుంతలను పూర్తి చేసి పరిసరాల పరిశుభ్రతను పాటించాలని రామతీర్థం పంచాయతీ కార్యదర్శి రమేష్ లబ్ధిదారులను కోరారు. రామతీర్థం గ్రామంలో ఉపాధి హామీ పథకం లో ఐదుగురికి ఇంకుడు గుంతలు మంజూరు కాగా నేడు ఇద్దరు లబ్ధిదారులు ముగ్గు పోసుకొని పనులు ప్రారంభించారు. ఉపాధి హామీ ద్వారా ప్రతి ఇంకుడు గుంతకు రూ.6,600 అందించనున్నట్టు ఆయన తెలిపారు . ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మి పాల్గొన్నారు.

# మల్టీపర్పస్ వర్కర్స్ కి సన్మానం



**వేద న్యూస్, నల్లబెల్లి :**

అరవైపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్టీపర్పస్ వర్కర్స్ అనిర్వచనీయమైన సేవలను కొనియాడారు. ప్రజలకు అంకితభావంతో సేవలు అందిస్తున్న మాట్ల వంశీ, దామెర రాజేందర్‌లను గ్రామంలోని ఉత్తమ మల్టీపర్పస్ వర్కర్స్‌గా గుర్తించారు. వారికి అవార్డు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ నిర్మల పాల్గొని అభినందనలు తెలిపారు.

# బాలలపై సోషల్ మీడియా నియంత్రణ

**వేదన్యూస్ డెస్క్:**

నేటి ఆధునిక యుగంలో సామాజిక మాధ్యమాల వినియోగం విపరీతంగా పెరుగుతుంది. వాట్సప్, ఫేస్‌బుక్, ఎక్స్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి ఆన్‌లైన్ వేదికలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. సామాజిక, విద్య, ఆర్థిక, రాజకీయ సంబంధిత విషయాల తెలుసుకోవడానికి ఎంతగానో దోహద పడుతున్నాయి. మారుమూల ప్రాంతాల అణచివే యబడిన వర్గాల గొంతును వినిపిస్తున్నాయి. సామాజిక చైతన్యానికి ఊపిరిలూదుతున్నాయి. కానీ రోజురోజుకు జనాలు వాటికి బానిసవ్వడం ఆందో ళన కలిగిస్తున్నది. ఒకప్పుడు పెద్దలకే పరిమితమైన ఈ ఆన్‌లైన్ వేదికలు ఇప్పుడు పిల్లల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఆటపాటలతో సాగే బాల్యం మొబైల్ స్క్రీన్‌లో ఇరుక్కుపోయింది. వీటినుంచి పిల్లల్ని కట్టడి చేయడం తల్లిదండ్రులకు తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో గత ఏడాది ఆస్ట్రేలియా ప్రభుత్వం తమ దేశంలో 16 ఏళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాలు వినియోగించడంపై నిషేధం విధించింది. ఇప్పుడు ఫ్రాన్స్ కూడా అదే బాటలో నడిచే ప్రయత్నం చేస్తుంది. ఇటీవల తూర్పు ఫ్రాన్స్‌లోని నోజెంట్ పట్టణంలోని ఓ పాఠశాలలో విద్యార్థి దాడి ఘటన తర్వాత 15 ఏళ్ల లోపు వారికి సోషల్ మీడియాను నిషేధించే యోచనలో ప్రభుత్వం ఉందని ఫ్రాన్స్ ప్రధాని పేర్కొన్నారు. ఈ విషయంలో ఇయు నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని లేదా తామే అమలు చేస్తామన్న ప్రకటించాడు. ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకున్న రెండో దేశంగా ఫ్రాన్స్ నిలిచే అవకాశం ఉంది. సామాజిక మాధ్యమాల కంటెంట్ పిల్లల మనస్తత్వంపై తీవ్రప్రభావం చూపుతుంది. దుష్ప్రవర్తనకు కారణం అవుతు న్నాయి. వీటిని నియంత్రించకపోతే భవిష్యత్తు భావి పౌర సమాజం అంధకారమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి పలు దేశాలు సామాజిక మాధ్యమాలనుంచి పిల్లలను దూరంగా చేయాలని ఆలోచిస్తున్నాయి. మరోవైపు తల్లిదండ్రులనుంచి కూడా ప్రభుత్వాలపై ఒత్తిడి పెరుగుతుంది. పిల్లలు ఎదుగుతున్న దశలో సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్‌లకు బానిసవడం వలన వారిలో విపరీత ప్రవర్తన, దూకుడు స్వభావం పెరుగుతుంది. విలువలు పతనమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల కంటెంట్ పిల్లలను కొన్ని సార్లు తప్పుదారి పట్టిస్తున్నాయి. సామాజిక మాధ్యమా లు తరచూ వీక్షించడం వలన పిలల్లో ఓపిక, సహనం, ఆలోచనశక్తి నశిస్తుంది. విద్య విషయా లలో వెనకబడుతున్నారు. పిల్లలు పెద్దలపట్ల గౌరవం మర్యాద లేకుండా ప్రవర్తిస్తున్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా గల భారతదేశంలో బాలల జనాభా కూడా అధికం. పిల్లలు సామాజిక మాధ్య మాల బారినపడకుండా చూడడం చాలా అవసరం.

# పాస్టర్స్ ఫెలోషిప్ కొత్త కమిటీ ఎన్నిక




**వేద న్యూస్, సంగెం :**

వరంగల్ జిల్లాలోని సంగెం మండలంలోని పాస్టర్స్ ఫెలోషిప్ కొత్త కమిటీ ఎన్నికను శుక్రవారం జిల్లాలోని బ్యూలా ప్రార్థన మందిరములో నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్స్? ఫెలోషిప్ చైర్మన్ పాస్టర్ కొమ్ముల సమూయేల్ మాట్లాడుతూ 2025-2027 సంవత్సరానికి గాను సంగెం మండల పరిధిలోని పాస్టర్స్ ఫెలోషిప్ కొత్త కమిటి ఎన్నికలను నిర్వహించగా అంధ్యక్షుడుగా ఎస్.ఫిలిప్‌జాన్, ఉపాధ్యక్షులుగా కె.వీనస్ బాబు, సహాయ కార్యదర్శిగా బి.మోహన్ నాయక్, కోశాధికారిగా పి.డేవిడ్ రాజు ఎన్నికయ్యాన్నట్లుగా తెలిపారు.

# ఎంపీడీవో వినతిపత్రం అందజేత

**వేద న్యూస్, రాయికల్ :**



జగిత్యాల్ జిల్లాలోని రాయికల్ మండల్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులందరూ ఎంపీడీఓకి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం నుంచి మంజూరైన సీఆర్ఆర్ఎస్సీ సబ్ ప్లాన్ పనులను చేయుటకు గ్రామసభ లేకుండా వివిధ వ్యక్తులకు పనులు అప్పగిస్తున్నారని సమాచారం మేరకు ఎంపీడీవో ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఏ పనిని ఎవరికి అప్పగించాలనే విషయంపై గ్రామసభ నిర్వహించి గ్రామసభలో ఆమోదం తెలిపిన వ్యక్తికి మాత్రమే అట్టి పనిని చేయుటకు అర్హుడుగా భావించి తీర్మానం చేసిన తర్వాతనే ఆ వ్యక్తికి పని అప్పజెప్పాలి కానీ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఎవరికి నచ్చిన వ్యక్తి ఉంటే వారికి ఇవ్వడం జరుగుతుంది అని అలా చేస్తే బాధ్యతారాహిత్యం కింద వస్తుందని తెలియజేసుకుంటూ గ్రామసభల తీర్మానం ప్రకారమే పనులు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పద్మాక్షి కోవెలలో
# శ్రావణ వేడుకలు




**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ మహానగరంలో సుప్రసిద్ధి చెందిన శ్రీ హనుమద్గిరి పద్మాక్షి అమ్మవారి దేవాలయంలో శ్రావణ మాస చివరి శుక్రవారం వేడుకలు చాలా ఘనంగా జరిగాయి. శుక్రవారం అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించి, వివిధ రకాల పూలమాలలతో, కుంకుమ- పసుపుతో అమ్మవారిని అలంకరించి భక్తుల సమక్షంలోనే హారతి ఇవ్వడం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగిందని ఆలయ అర్చకులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ శర్మ తెలిపారు.

# సహస్ర మర్డర్ మిస్టరీ వీడింది..

సమాచారం. ఆ సమయంలోనే బాలిక కేకలు వినిపించినట్టు పక్క భవనంలో నివసించే వాళ్లు పోలీసులకు సమాచారమిచ్చారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్ సభ్యులు ఆధారాలు సేకరించారు. జాగిలాలు స్పాట్ నుంచి నేరుగా బయటకు వెళ్లిపోయాయి. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల ఫుటేజ్‌లు సేకరించి వేర్వేరు కోణాల్లో సమాచారం సేకరించారు. అనుమానితుల్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. కానీ బలమైన ఆధారాలు ఎక్కడా పోలీసులకు దొరకలేదు.

**- ఆ రోజు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వర్క్ ఫ్రమ్ హెూం**

నాలుగు రోజులైనా మర్డర్ మిస్టరీ వీడకపోవడంతో పోలీసులు ఛేదిస్తారా చేతులెత్తేస్తారా అన్న అనుమానాలు బలంగా వినిపించాయి. ఈ క్రమంలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇచ్చిన హింట్ కీలకంగా మారింది. సహస్ర హత్య జరిగిన రోజు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వర్క్ ఫ్రమ్ హెూం చేశాడు. ఇంట్లో ఉంటూనే బయట ఏం జరుగుతుందో యథాలాపంగా గమనించాడు. అప్పుడు కంటపడ్డాడో బాలుడు. దాక్కుంటూ వెళ్తూనే.. సజ్జపైన లెటర్ పెట్టాడు. అదే విషయాన్ని పోలీసులకు పూసగుచ్చినట్టు వివరించాడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఈ మాత్రం క్లూతో పక్క బిల్డింగ్‌లో కుర్రాడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఏం చేశావ్.. ఎందుకిలా చేశావ్ అని ప్రశ్నించారు. ముందుగా బుకాయించిన బాలుడు.. ఆ తర్వాత క్రైమ్ సీన్ మొత్తం రివీల్ చేశాడు.

టెన్త్ క్లాస్ చదువుతున్న వాడే.. బట్.. అతని ఆలోచన విధానం చూస్తే మైండ్ బ్లాంక్ అవుతోంది.. పట్టుమని పదిహేనేళ్లు కూడా లేవు ఇన్ని క్రిమినల్ ఆలోచనలా..? అన్న విస్మయం కలుగుతుంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇచ్చిన సమాచారంతో బాలుడ్ని అదుపులోకి తీసుకుని విచారించారు పోలీసులు. ముందుగా లెటర్ గురించి ఆరాతీశారు. ఆపై దబాయించి ప్రశ్నిస్తే.. నమ్మలేని నిజాలు బయటపడ్డాయ్. బాలుడి క్రిమినల్ బ్రెయిన్ చూసి పోలీసులు అవాక్కయ్యారు.



ఎందుకంటే,.. ముందే పేపర్‌పై స్క్రిప్ట్ రాసుకుని ఇంట్లోకి చొరబడ్డాడు. నిందితుడి ఇంట్లో హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తంతో తడిచిన దుస్తులు, ముందే రాసుకున్న లెటర్‌ను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు

**- సహస్ర ఇంటి పక్కనే బాలుడి నివాసం**

దానికి అతను పెట్టుకున్న పేరు మిషన్ థెఫ్ట్. కాకపోతే అది అనుకోకుండా.. మిషన్ మర్డర్‌గా మారింది.

వేద న్యూస్

శనివారం ఆగస్టు 23, 2025

## రైస్ పాడవకుండా ఎలా ఉంచాలి..?



**వేద న్యూస్ డెస్క్:**

ఉదయాన్నే వండిన బియ్యం రాత్రి వరకు పాడవకుండా ఉంచుకోవడానికి కొన్ని చిట్కాలు పాటించాలి. ఈ చిన్న చిట్కాలు పాటించడం ద్వారా బియ్యం రుచితో పాటు తేమను కోల్పోకుండా ఉంచటానికి చాలా ఉపయోగ పడుతుంది. పెద్ద వేడుకలు లేదా రోజువారీ వంటకు ఈ చిట్కాలతో అవసరం ఉంటుంది. ఉదయాన్నే వండిన రైస్ పాడవకుండా తాజాగా ఉంచుకోవడానికి మీరు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. ఇది పండగలు, పెళ్లిళ్లు, ఇతర వేడుకల సమయంలో ఉపయోగపడుతుంది. ఈ పద్ధతిని అనుసరించడం ద్వారా రైస్ రుచిగా ఉండడమే కాకుండా.. ఎక్కువసేపు పాడవకుండా ఉంటుంది. రూమ్ లలో అధిక వేడి కారణంగా మనం వండే రైస్ చాలా త్వరగా పాడవుతుంది. ఉదయం వండిన రైస్ ని మధ్యాహ్నం లేదా రాత్రికి ఉపయోగించే సమయంలో అప్పటికప్పుడే తినలేని పరిస్థితి ఉంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఇది ముఖ్యంగా చాలా సమయం ముందే వండిన రైస్ కి అనుకూలంగా ఉంటుంది. రైస్ సరిగ్గా ఉడికించడానికి బియ్యం పూర్తిగా మృదువుగా ఉడికిన సమయంలో ఒక టీస్పూన్ కొబ్బరి నూనెను అందులో వేసి కలపాలి. ఇది రైస్ ని పుల్లలు పుల్లలుగా ఉండేలా చేస్తుంది. కొబ్బరి నూనె వాసన కూడా ఉండదు. రైస్ నూనెతో మృదువుగా తయారవ్వడంతో పాటు రుచికరంగా ఉంటుంది.రైస్ ని వడగట్టిన వెంటనే అదే పాత్రలో ఉంచకూడదు. ఇలా చేస్తే వేడి కారణంగా రైస్ త్వరగా పాడవుతుంది. దీని కోసం ఒక పెద్ద పాత్ర లేదా హాట్ బాక్స్ తీసుకుని దాని లోపల శుభ్రమైన తెల్లని క్లాత్ ని వేయాలి. ఆ తర్వాత వడగట్టిన రైస్ ని క్లాత్ లో పెట్టి, బాగా మూతపెట్టాలి. రైస్ వేడి తగ్గేంతవరకు అలాగే ఉంచితే రైస్ తాజాగా ఉంటుంది. అంతేకాకుండా ఇది వేడి కారణంగా ఉబ్బడం లేదా పాడవ్వడం జరగదు. ఈ విధానాన్ని పాటిస్తే.. రైస్ పూర్తిగా ఉడికినప్పటికీ అది తినడానికి బాగా మృదువుగా ఉంటుంది. ఇలా చేయడం వల్ల రోజువారీ ఉపయోగం మాత్రమే కాకుండా పెద్ద కార్యక్రమాల్లో కూడా ఉపయోగపడుతుంది.

## చికెన్ ప్రియులకు షాకింగ్ న్యూస్..!

**వేద న్యూస్ డెస్క్:**

చికెన్ అంటే చాలా మందికి ఎంతో ఇష్టం. ప్రత్యేకంగా ఆదివారం చికెన్ లేకుండా గడపడం కొందరికి అసాధ్యం. ఇది అందుబాటులో ఉండే నాన్ వెజ్ ఆహారాల్లో అందరూ ఇష్టపడేది. కానీ చికెన్ లో కొన్ని భాగాలను తినడం మన ఆరోగ్యానికి హానికరం అని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం. చాలామంది కోడి మెడ భాగాన్ని ఎంతో ఇష్టంగా తింటుంటారు. కానీ ఈ భాగంలో కోడి శోషరస వ్యవస్థ ఉంటుంది. శోషరస వ్యవస్థ శరీరంలోని వ్యర్థాలు, బ్యాక్టీరియాలను బయటకు పంపుతుంది. ఈ విషతుల్య పదార్థాలు కోడి శరీరంలో చేరే ప్రమాదం ఉంది. ఈ భాగాన్ని తింటే, వాటిలో ఉండే హానికరమైన పదార్థాలు మన శరీరంలోకి చేరి అనారోగ్య సమస్యలను కలిగించవచ్చు. అందుకే కోడి మెడను తినకూడదు. కోడి తోక భాగం గురించి కొందరు పెద్దగా పట్టించుకోరు. కానీ ఈ భాగం చాలా హానికరమైన క్రిములు, బ్యాక్టీరియాలను కలిగి ఉంటుంది. ఈ క్రిములు తిన్న వెంటనే శరీరంపై ప్రభావం చూపకపోవచ్చు, కానీ ఆ తరువాత ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి. కాబట్టి కోడి తోక భాగాన్ని తినకుండా వదిలేయడం మంచిది. చికెన్ మెడ, తోకతో పాటు, కోడి మొప్పలు తినడం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. కోడి మొప్పల్లో ఆహారం జీర్ణమయ్యే భాగాలు ఉంటాయి. ఈ భాగంలో క్రిములు, హానికరమైన బ్యాక్టీరియా ఎక్కువగా ఉంటాయి. ఈ క్రిములు మన శరీరానికి ప్రమాదం కలిగించే




అవకాశముంది. అందువల్ల కోడి మొప్పలను తినడం పూర్తిగా మానేయండి. కోడి ఊపిరితిత్తులు కూడా తినకూడని మరో భాగం. ఈ భాగంలో క్రిములు, వైరస్‌లు అధికంగా ఉంటాయి. ఇవి తింటే శరీరానికి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కలగవచ్చు. కాబట్టి ఈ భాగాన్ని తినకూడదు. సాధారణంగా చికెన్ శరీరానికి పోషకాలను అందించగల అద్భుతమైన ఆహారం.

## తేనె వల్ల జుట్టు తెల్లబడుతుందా..?

**వేద న్యూస్ డెస్క్:**

జుట్టు రంగు మెలనిన్ పిగ్మెంట్ వల్ల వస్తుంది. ఇది జుట్టు వేర్లలోని మెలనోసైట్స్ ద్వారా ఉత్పత్తి అవుతుంది. తేనెలో గ్లూకోజ్ ఆక్సిడేజ్ అనే పదార్థం ఉంది. ఇది తక్కువ స్థాయిలో హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను ఉత్పత్తి చేస్తుంది. కానీ ఇది జుట్టు రంగు మార్చడానికి సరిపోదు. మనలో కొంతమంది తేనే తలపై పడితే జుట్టు తెల్లబడుతుందని నమ్ముతుంటారు. జుట్టు తెల్లబడటానికి గల అసలు కారణాలను, తేనెకు సంబంధించి ఉన్న తప్పుడు నమ్మకాలపై వైద్య నిపుణులు ఎం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. మన జుట్టు వేర్ల వద్ద ఉండే హేర్ ఫాలికల్స్ లో మెలనోసైట్స్ అనే కణాలు ఉంటాయి. ఈ మెలనోసైట్స్ మెలనిన్ పిగ్మెంట్‌ను ఉత్పత్తి చేస్తాయి. దీని వల్లే జుట్టుకు నల్లటి రంగు వస్తుంది. కొన్ని సందర్భాల్లో జన్యు మార్పులు లేదా వయసు ప్రభావం వల్ల మెలనిన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. ఈ పరిస్థితిలో జుట్టు రంగు క్రమంగా తెల్లబడుతుంది. ఇది సహజమైన ప్రక్రియ కాగా.. తేనె వల్ల జుట్టు తెల్లబడడం అనేది శాస్త్రీయంగా అవాస్తవమని నిపుణులు తెలిపారు. తేనెలో గ్లూకోజ్ ఆక్సిడేజ్ అనే పదార్థం చాలా తక్కువ మోతాదులో ఉంటుంది. ఇది నీటితో లేదా తేమతో కలిసినప్పుడు హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్ పెరాక్సైడ్ రంగు మార్చే లక్షణాలు కలిగి ఉన్నప్పటికీ, తేనెలో ఇది చాలా తక్కువ స్థాయిలో మాత్రమే ఉంటుంది. ముఖ్యంగా తేనె నుంచి వచ్చిన హైడ్రోజన్ పెరాక్సైడ్ జుట్టు రంగును మార్చలేని స్థాయిలో ఉండటం వల్ల, తేనె వల్ల జుట్టు తెల్లబడటం అనేది అసంభవమట.



తేనే వల్ల జుట్టు తెల్లబడుతుందని చెప్పడం ఒక అపోహ మాత్రమే. తేనెను తలకు రాయడం వల్ల హానికరమైన ప్రభావాలు ఉండవు. తేనెలో ఉన్న పోషకాలు తల చర్మానికి మేలు చేస్తాయని మాత్రమే శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. అంతేకాకుండా తేనెను నేరుగా తలకు రాసినప్పటికీ.. ఇది జుట్టు రంగును మార్చే శక్తిని కలిగి ఉండదు. తేనెకు సంబంధించిన శాస్త్రీయ పరిశీలనల్లో కూడా ఇలాంటి ప్రభావాలపై ఎలాంటి ఆధారాలు లేవని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. తేనే వల్ల జుట్టు తెల్లబడుతుందని నమ్మి దీన్ని దూరంగా పెట్టడం సరైనది కాదు. తేనె ప్రకృతి సమృద్ధి కలిగిన అద్భుతమైన పదార్థం. ఇది ఆరోగ్యానికి, చర్మానికి ప్రయోజనకరమైన గుణాలు కలిగి ఉంది. రసాయన పదార్థాలు కలిగిన రంగులతో పోల్చితే తేనెలో ఉండే హైడ్రోజన్ పెరాక్సైడ్ చాలా తక్కువ మోతాదులో ఉంటుంది. కాబట్టి తేనెను ఉపయోగించడం వల్ల జుట్టు తెల్లబడుతుందని అనుకోవడం శాస్త్రీయంగా అవాస్తవం.

## స్కామ్ అకౌంట్లను గుర్తించడానికి బ్యాంకుల్లో ఏఐ ఆధారిత వ్యవస్థ




**వేద న్యూస్ డెస్క్:**

ఆన్‌లైన్ మోసాలు, మనీలాండరింగ్‌ను అరికట్టడానికి అన్ని బ్యాంకులలో ఖాతాలలో కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత ధృవీకరణను తప్పనిసరి చేయాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) నిర్ణయించింది. ఈ మేరకు ఆర్‌బీఐ త్వరలో మార్గదర్శకాలను జారీ చేయనుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మొదట స్కామ్ ఖాతాలను గుర్తించి వాటిని బ్లాక్ చేయడానికి ఆర్‌బీఐ ఓ బ్యాంకులో ఏఐ- ఆధారిత వ్యవస్థను ఉపయోగించి పైలట్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సమయంలో సదరు ప్రభుత్వ రంగ బ్యాంకులో మాత్రమే 13 లక్షల ఖాతాలను గుర్తించి బ్లాక్ చేశారు. మార్గదర్శకాలు అమల్లోకి వచ్చిన తర్వాత, ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకులతో సహా అన్ని బ్యాంకులు మ్యూల్ ఖాతాలను గుర్తించి బ్లాక్ చేయాల్సి ఉంటుంది. తద్వారా ఏ రకమైన అక్రమ బదిలీనైనా అరికట్టవచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సైబర్ మోసగాళ్లు సామాన్యులను లక్ష్యంగా చేసుకోకుండా ఉండటానికి ఈ వ్యవస్థ ఎలాంటి టూ-వే లావాదేవీనైనా గుర్తించగలదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా బ్యాంకింగ్ లైసెన్స్‌లు, వాటి పునరుద్ధరణ దీని పరిధిలోకి వస్తాయని తెలుస్తోంది. ఈ నిబంధనలను పాటించేందుకు ప్రభుత్వం దేశవ్యాప్తంగా భారీ ప్రచారాన్ని కూడా నిర్వహించాలని భావిస్తున్నట్టు సమాచారం.

## శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్ ఐపీఓకు భారీ స్పందన

**వేద న్యూస్ డెస్క్:**

జామ్‌నగర్‌కు చెందిన శ్రీజీ గ్రూప్‌కు అనుబంధ సంస్థ శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్ లిమిటెడ్ ఐపీఓకు భారీ స్పందన వచ్చింది. రూ.410.71 కోట్ల విలువైన ఈ పబ్లిక్ ఆఫరింగ్ ఆగస్టు 19న ప్రారంభమై ఆగస్టు 21న ముగిసింది. ఈ ఇష్యూ పూర్తిగా ఫ్రెష్ ఇష్యూ రూపంలో ఉండగా, ఒక్కో షేరు ధరను రూ.240 నుంచి రూ.242 మధ్యగా నిర్ణయించారు. లాట్ సైజ్ 58 షేర్లుగా ఉండటంతో, ఒక రిటైల్ ఇన్వెస్టర్ కనీసం రూ.14,616 పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం, 1.14 కోట్ల షేర్లకు గాను 21.17 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో మొత్తం సబ్‌స్క్రిప్షన్ 18.56 రెట్లు నమోదైంది. విభాగాలవారీగా చూస్తే, నాన్-ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు 38.96 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్లు 14.73 రెట్లు, క్వాలిఫైడ్ ఇన్వెస్టర్లు 9.97 రెట్లు సబ్‌స్క్రైబ్ చేశారు. షేర్ల కేటాయింపు ఆగస్టు 22న




జరగనుండగా, లిస్టింగ్ ఆగస్టు 26న బీఎస్ఈ, ఎన్ఎస్ఈ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో జరుగనుంది. శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్ లిమిటెడ్ భారత్, శ్రీలంకలోని 20 ఓడరేవుల్లో డ్రై బల్క్ కార్గో (పొడి సరుకులు) రవాణా, లాజిస్టిక్స్ సేవలు అందిస్తోంది. ప్రస్తుతం సంస్థకు 80కి పైగా వెసెల్స్ (టగ్‌బోట్లు, బార్జ్‌లు, ఫ్లోటింగ్ క్రేన్‌లు), అలాగే 370కి పైగా వాణిజ్య వాహనాలు, ఎర్త్‌మూవింగ్ మెషినరీ ఉన్నాయి. ఐపీఓ ద్వారా వచ్చిన నిధులను కొత్త షిప్‌లు కొనుగోలు చేయడానికి, అలాగే కొన్ని ఋణాల భారం తగ్గించేందుకు వినియోగించనున్నట్లు కంపెనీ ప్రకటించింది.

## ప్రముఖ పారిశ్రామికవేత్త మృతి

**వేద న్యూస్ డెస్క్:**

భారత సంతతికి చెందిన ప్రముఖ బ్రిటీష్ పారిశ్రామికవేత్త లార్డ్ స్వరాజ్ పాల్ లండన్‌లో 94 ఏళ్ల వయసులో మరణించారు. వయోసంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆయన గత కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం (స్థానిక కాలమానం ప్రకారం) లార్డ్ తుదిశ్వాస విడిచారు. యూకేలో కాపారో గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌ను స్థాపించిన లార్డ్ అరుదైన భారత్‌లో జన్మించిన బ్రిటీష్ ఇండస్ట్రియలిస్ట్, ఫిలాన్త్రోపిస్ట్‌గా గుర్తింపు పొందారు. పంజాబ్‌లోని జాలంధర్‌లో 1931 ఫిబ్రవరి 18న లార్డ్ స్వరాజ్ పాల్ జన్మించారు. పంజాబ్ యూనివర్సిటీ నుంచి బీఎస్సీ పట్టా పొందారు. అమెరికాలోని మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎమ్మెస్సీ పూర్తి చేశారు. అనంతరం తన తండ్రి స్థాపించిన కుటుంబ వ్యాపార సంస్థ అపీజే గ్రూప్‌లో పనిచేసేందుకు భారత్‌కు తిరిగి వచ్చారు. అయితే తన కుమార్తె అంబికా చికిత్స కోసం 1966లో యూకేకి వెళ్లారు. ఆమె మరుసటి ఏడాది లుకేమియాతో మరణించింది. అనంతరం 1968లో యూకేలో కాపారో గ్రూప్ స్థాపించి అక్కడే స్థిరపడిపోయారు. లార్డ్ కాపారో గ్రూప్‌ను స్టీల్, ఇంజనీరింగ్ రంగాలలో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్‌గా విస్తరింపజేశారు. అలాగే, 1975లో బ్రిటన్, భారత్ మధ్య మెరుగైన సంబంధాల కోసం ఇండో-బ్రిటిష్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. వ్యాపార రంగంలోనే కాకుండా లార్డ్ రాజకీయాల్లో మంచి గుర్తింపు సాధించారు. 1996లో లైఫ్ పీర్‌గా నియమితులైన లార్డ్ పాల్.. హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో వాణిజ్యం, విద్య, ఉద్యోగవకాశాల కమిటీలలో చురుకుగా పాల్గొన్నారు. ఆ తర్వాత డిప్యూటీ స్పీకర్‌గా, 2009లో ప్రైవీ కౌన్సిలర్‌గా నియమితులయ్యారు. లండన్ జూను



మూసివేత నుంచి కాపాడడంలో, పిల్లల విభాగం, ఇతర కార్యక్రమాలకు మద్దతు ఇచ్చారు. అలాగే, తన కుమార్తె అంబికా జ్ఞాపకార్థం అంబికా పాల్ ఫౌండేషన్ స్థాపించి, విద్య, ఆరోగ్య రంగాల్లో అనేక సహాయ కార్యక్రమాలను నిర్వహించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073